# అన్నేకారిజల

ఆకాశం పటమెగిరె. తూర్పున తెల్లంగత్యాన్ రేగె. కొండల్ను చీల్చుకుంటా ఎఱ్రంగా మండే కొలిం మాదిర్తో పుట్టకొచ్చె సూరీడు.

ఆ నునువెచ్చని ఎండకు, ఆకాశిం అంచుల్లోనుంచీ ధర్ణిపైకి దిగి, ఊరికుత్తరాన మావిడి తోట పైన కొఱ్ఱు వొడ్డిండె. సరిగ్గా అప్పుడే తన అయిదెకరాల టమాటా తోటలో అడుగు పెట్టెమునెప్ప. వొగసూరి సుట్టకారం కడ్లింతింత జేసుకోని జూశ, ఆమింద తోటంతా గెవనించె. పాదిపాదీ జూశ. పాదల్లో ఇరిగ్గాసిండే సెట్టుసెట్టును జూశ. సెట్ల నిండా కాయలే. కడ కోతకు సిద్ధంగా వుండాయి. కొన్ని పచ్చంగా వుండాయి. కొన్ని దోరదోరగా వుండాయి. కొన్ని పసుపు పూసుకున్న కొత్త పెండ్లి కూతురుమాదిరుండాయి. యింకొన్ని వళ్ళంతా కుంకం అద్దుకున్నిట్టుండాయి. కొఱ్ఱులో వుండె ఏడు రంగులు ఎండకు తట్టుకోలేక మెల్లిమెల్లిగా వచ్చి ఆ టమాటా తోటలో దాంకుంటావున్నిట్టుండె. నేలంతా రంగు రంగులుగా అనిపిస్తా వుండె.

"ఆ కొఱ్ఱూ అంతే! ఏడు రంగుల్తో ఈ జగతిని బెమింపజేసి మళ్ళా వొగ్గిడివుకే సడీ సప్పుడు లేకుండా ఎప్పుడు సయిగ్గా మాయమై పోతుందో తెలీదు. యిదీ అంతే. మాయిదారి పంట. మాయలమారి సేద్దెం" అనుకుండె.

ఆమీన వంగి, కాయలే సెట్టుగా, సెట్టే కాయలుగా కనిపిస్తావుండే వొగ సెట్టును గబుక్కున పీకె ఆ దెబ్బకు అది లబలబా నోరు కొట్టుకుంటా "అరగాసునా కొడకా! కొంతే గాలం కొడకా నీకేం పొయ్యే కాలంరా నన్ను అట్ల పీకితివి?" అంటా అరిసె. మునెప్ప సింతపండు తిన్నోడి మాదిరి ముగం ఇంత జేసుకోని, సింగిలించుకుంటా ఎఱ్రిగా దాని కల్లా జూశ. ఆసెట్లో పండ్లన్నీ ఎఱ్రంగా మాగిండె. ఆ ఎరుపంతా ఆయప్ప కండ్లల్లోకి దూకి, కండ్లల్లో నీళ్ళు తిరిగె. కోపమూ ముంచకొచ్చె. పెదాలు అదిరె. నొసలు సిట్లించె.

ఆ సెట్టు ఏమీ అనుకోలా. తన పూల పూల నోరు తెరిసి పచ్చ పచ్చంగా నవ్వె. ఈయప్ప యింకా రెచ్చిపాయ.

"వొసే పెంటకు పెరిగే సెట్టా. నీ వెంత? నీ బగిసెంత? అసలు నీ బతుకెంత?అరగాసు పసిరిక పామట్టాంటిది మీద బడితేనే పిసపిసా నలిగిపోయే దానివి. ఈ మడుసుల్తో ఎందుకే ఆడుకుంటావు?" అంటా నిగ్గదీసి అడిగె మునెప్ప.

అదింకా గెట్టింగా నవ్వె. పక పకా నవ్వె. తోటంతా ధ్వని పలికేటట్టుగా నవ్వె. పాదు పాదు, సెట్టు సెట్టు గొల్లుమంటా నొగినట్టనిపించె.

ఈయప్ప కోపం ఉచ్చికెక్కె. యిసిరి దూరంగా పారేశ. అది బొయ్యి అయప్ప నిన్న సందేళ కొనక్కొచ్చి పెట్టిండె డబ్బా పక్కన దబక్కన బడె. దాంతో దాని నడుము తిరిగి నట్టాయ.

నోరు మూసుకోని పడించోట పడినట్టే వుండిపాయ.

అయినా ఆయప్ప కోపం నిలవలా! ఉక్రోసం పొడస కొచ్చె. అంతే! సద్ద సేన్లో గుడ్డెద్దు జొరబడినట్టు జొరబడె. ఒంటె మెడొంచినట్టొంగె. వంగినోడు వొంగినట్లుండకుండా రొండు సేతుల్తో అబ్బిలించి అబ్బిలించి సెట్లను పీకబట్టె. అందిన సెట్లు అందినట్లే పీకబట్టె. పీకిపీకి కుప్పబెట్టె. ఆయప్ప సేతుల్లో బడి, ఆయప్ప మొణుసు మాదిరే టమాటాలు కస కసానలిగిపోయి సస్తావుండె. ఆయప్ప సేతుల్తో బాటు ఆనేలా టమాటా రసంతో తపతపా తడిసి పోతావుండె. అయినా ఆయప్ప పెరికినోడు పెరికి నట్టే వుండె. కుప్పమింద కుప్పయేస్తానే వుండె. దుమ్ము దుకూరించేస్తా వుండె. ఆ తోట మద్దెలో ఉన్నిట్టుండి పుట్టకొచ్చిన కొండ మాదిరి, పసల పండగ దినాన అగ్గిపెట్టి కాల్చేసే సిట్లాకువ్వ మాదిరి సెట్లకువ్వ పెరగతానే వుండె.

ఆయప్ప బుర్రలోను యోచ్చన్లు వొగదానిమిందొకటిగా ఎగబడతా వుండె. జరిగిందంతా అదే పనిగా గెవనానికి రాబట్టె.

◆ ◆ ◆ ◆

"ఏమబ్బా! మునెప్పా, రెడీనా?"

కరకరాంట పొద్దు పుట్టీపుట్టకనే రెడీగా యింటికొచ్చేసి పలకరించినాడు పుల్ల శాస్త్రగాడు నంజంపేట నర్శిమ్ములు.

అబ్బుటికే తానాలాడేసి నట్టింట్లో దీపం పెట్టి, కర్పూరం ముట్టిచ్చి హారతిచ్చి రెడీగా వున్న మునెప్ప "నీ కోసరమే సూస్తా వుండాన్నా, పోదామా?" అంటా యింటి ముందరికొచ్చె.

"అన్నీ సిద్ధమేనా?" అంటా అడిగె నరిసిమ్ములు.

"ఆ ఎప్పుడో రెడీ."

"అయితే యింక భూమి దెగ్గిరికి పోదామా?"

ఒక కొత్త గుల్లలో అన్నీ ఎత్తుకోని భూమి దెగ్గిరికి యెలబార్రి యిద్దరూ. తూర్పు తేటబడేగుందికి భూమి కాడికి చేరుకుండ్రి.

ఆ భూమిలో అయిదెకరాల టమాటా సెట్లు పూత కొస్తా వుండాయి. ఆ సెట్లు సూసుకుంటా బాయికాడికి బొయ్యి, గడ్డన గుల్లదించెమునెప్ప.

"సూడన్నా. ఈ అన్నే కారిబాయి. వొగబ్బుడు కీనీరు బాయి. దీనికింద పదెకరాలు పారుబడి వుండె. అట్టాంటిది పదేండ్లంయిపాయ యెండిపోయి. దాంట్లో బోరుయేపిస్తి. అప్పట్నుంచీ సగం నేల కాపాడ కొస్తావుండాది. ఈ సమచ్చరం వానలేబడలే. బాయిలో ఊట తగ్గిపాయ. దాన్ననసరించుకోని ఈ యెలిసేద్దెం, టమాటాలు నాటుకుంటి, సెట్లేమొ బంగారాకిట్లుండాయి. బాగా ఎరువులేసినా. సరిగ్గ ఎన్నబడేటప్పుడు బానపగిలినట్లు యిప్పుడు బోరు ఈడ్సకపాయ. ఎట్లనిగారిస్తా వుండాదోసూడు తోట. ఇప్పుడు కలికిరి టమాటా సంతలో

దీనిత్తగిల్ల కే.జి. ఇరవై రూపాయలు. సూసి సూసి యెట్టాదిలేసేది సెప్పు. అందుకనీ సొసైటీలోలోను తీసుకుంటి. ఆ పక్కన తగ్గులో బోరే పిద్దామనీ..."

యివరంగా సెప్పె మునెప్ప. కడుపులో బాధంతా ఎలగక్కి సెప్పె "సరే నీకు తప్పకుండా మేలు జరగతాది. నేను గనక పుల్ల పట్నానంటే తిరుగుండదురా మునిగా, పాతాళంలో వున్న గంగయినా సరే, తన్నుకోని పైకి రావాల్సిందే." నమ్మకంగా సెప్పె నర్శిమ్ములు.

"ఏమొ, అంతా దేవుని యత్నం. యింక ఆరంబిద్దామా?" అంటా ఈశాన్య మూలన దిగె.

ఆడ .... నర్శిమ్ములు తూర్పుకల్లా మల్లుకోని నిలబడి, బొడ్లోవుండె ఉత్తరేణి పుల్లదీసి నేల మీద బెట్టె. దానికి పసుపు కుంకాలు పెట్టె. టెంకాయ కొట్టె. ఆరతిచ్చె. అనాక రెండు సేతులు దెగ్గిరిగా జేర్చి, సూపుడేళ్ళను బొట్నేళ్ళను కలిపి, ఆ పుల్లను నడీమద్దెన అదిమిపెట్టి, నొసట కానించి, సూరె భగమానుడికి వొగ నమస్కారం జేసి 'సామి తల్లీ! పుల్ల తల్లీ! ఈ నేలలో జలజాడ సూపించు. కనికరించి నీ బిడ్డెను కాపాడుకో..." అంటా గొణుక్కోని మడింటీ తిరగబట్టె నర్శిమ్ములు. మునెప్ప ఆత్రంగా, యిచ్చిత్రంగా సూస్తా ఆయప్ప యెనకింటీ నడసబట్టె.

"ఏమన్నో. దీంతో నేల్లో వుండే జల యెట్ట తెలస్తాదీ?" అంటా అడిగె మునెప్ప.

"అదే రామునిగా యిచ్చిత్రము. ఈ పుల్లబట్టేది మావంశాచారం. తరతరాల్నించీ ఇది మావంశానికొస్తావుండే వరం. ఈ సుట్టు పక్కాలుండే నూటికి తొంబై భాగం బావులు మా పుల్ల శాస్తరం వల్లా తొగించినవే." పుల్ల శాస్త్రంలో వుండే తమ పుడింగుతనాన్ని ఏకరువు బెట్టె నరిసిమ్ములు.

అట్లమాట్లాడుకుంటా నడస్తా, వొగసాట అట్నే నిలబడిపాయ నర్శిమ్ములు. "మునిగా! పుల్ల ఈడ నిల్సిపోయిందాది సూడబ్బా." అంటా గెట్టిగా అరిసె.

మునెప్ప ఆ అరుపుకు ఎగిరిపడి, ఆ పుల్లకల్లా జూశ.

నర్శిమ్ములే వంచినాడో, ఆ పుల్లే వంగిందో అపరమాత్తునికే యెరికె, గానీ పుల్ల మాత్రం నేల దిక్కు వంగిండె.

ఈయప్పకు సంతోసమైపాయ, కుశాలగా దానికల్లా సూస్తానే వుండె. "యిద్దో, మునిగా! ఈ పుల్లకు నేరుగా గుర్తు పెట్టుకో, దాని మీద వొగరాయి పెట్టుకో." అనె ఆయప్ప.

ఈయప్ప అట్లే జేశ.

"యింక పొబ్బాయ్యోవ్ సామీ. నీ దరిద్రం తీరిపోతుందిలేపో. బోరింగోళ్ళను పిల్చకొచ్చి, ఈ తావన బోరింగేసుకో, నీళ్ళు పడకపోతే నా పేరు దీసి నీ పేరు పెట్టుకో." అంటా ఆయప్పిచ్చిన కాణిక తీసుకోని సక్కంగా యెలబారిపాయ.

ఆ మరుదినమే బోరింగోళ్ళను పిల్చకొచ్చి, వొగటిగాదు రొండుగాదు, మూడొందలడుగు లేయించె మునెప్ప.

ఊఁహుఁ జలజాడే కనిపించలా కడాకు "అన్నో, నల్ల రాళ్ళనే లొచ్చేసిండాది జలపవుడేలే.

ఇంక బోరింగు దిగదన్నో..." అంటా బోరింగోళ్ళు సేతులెత్తేసిరి. దాంతో సొసైటీలో దెచ్చిండే లోను దుడ్లు, యింట్లో వున్న యింకో పదివేలు బోరింగోళ్ళ పాలైపాయ

ఇంట్లో ఆడోళ్ళు యాడస్తా కూసుంద్రి.

"యింకేం మిగిలిండాదయ్యా. పెద్ద బిడ్డెమైనీరు దీరి ఏడేండ్లాయ. రెండోది మూడేండ్లాయ వోళ్ళ కింకనన్నా పెండ్లిండ్లు జెయ్యక పోతే అయినోళ్ళ సందన ఏమన్నా బరముంటాదా? కడగొట్టున బుట్టె, ఉడుబోతు పిందె మాదిరి వొగే వొగ మొగ మొలక పేరు సెప్పేదానికి. వోడు పదిసదగతా వుండాడు. వోడి కేం బెట్టి సదిగించేది?" బొరోమంట యాడ్సబట్టె మునెప్ప భారియ.

"యింతదానికే యిట్టయిపోతే యెట్టనే. ఊరికే వుండే బాశాలీ?" అంటా సముదాయించె మునెప్ప.

మునెప్ప అంతటితో ఆగలేదే. ఎట్టాగతాడు ఆయప్పయేది బట్టుకుంటే అదేనే. బోగుండె నిబ్బరం కలిగినోడు గదా. మళ్ళా ధైర్నం దెచ్చుకుండె "జలో? సావో? టమాటాలో? పెడాకులో?" అంటా శరత్తుబట్టె.

అదే నమీంలో టమాటాల ధర ఆకాశానికంటె, సుక్కల్తో నేస్తం గట్టె, మునెప్ప మొఖుసుండగుల్లా.

"దానాలీసీఁవ, నీళ్ళుండాలేగానీ, ఈ రేటిట్టే వుంటే అప్పంతా ఎంత? తుంగా తుసుకా. వొగ కోతకే ఎగిరి పోదా?" అనుకుండె.

ఎవురు సెప్పినా యినుకోలే. యింట్లో నగలన్నీ ఎత్తకపాయ. కలికిరి బ్యాంకీలో కొదవ బెట్టె. దుడ్డు దెచ్చె. సాలందానికి 'సేబదుళ్ళు' జేసె. ఈసారి పుల్ల శాస్త్రరం గాదని తిరప్తికి పరిగెత్తె. జియాల జిస్టును తీసుకొచ్చె. మీటరేయించె. పాయింటు బెట్టించె. ఆ పాయింటు కాడ మళ్ళా బోరింగేయించె.

బోరింగు 'ఓ' తొంబయ్యడుగులుదిగె, మన్నులో త్యామ కనిపించె మునెప్ప మొఖుసు పొయ్యిమింద పెట్టిన పాలు మాదిరి పొంగి పాయ.

"మునెప్ప పీతి కష్టం పడె. అదురుష్టం మల్లె. యిప్పుడుండే రేటుకు లచ్చాధికారే. దుడ్లు వారుకుండే పనే." అనుకో బట్రి జనాలు. మునెప్పకు యింకా పట్టుదల పెరిగె

"ఎమన్నా గానీ గాక, దీని అంతు సూడాల్సిందే" అంటా అనుకుండె. మడిసి ఉడుం పట్టుబట్టేశ.

"యెవ్వావ్. ఎనుకూ ముందు నూడగాకండీ. బోరింగు నిండా నీళ్ళు సిమ్మిందాంకాయెయ్యండి. అంతు తేల్చండి. ఇడసండీ బోరింగు." అంటా అనె.

ఆ రేత్తిరి బోరింగోళ్ళకు, కోన్ని కోసి, సారాయి పోసి యిందు పెట్టె. దాంతో వోళ్ళకు బోకుశాలయ పాయ. వోళ్ళదేం బోతా వుండాది? వోళ్ళ పెగ్గెంతా సూపిచ్చిరి. బోరింగు దించినోళ్ళు దించినట్టే వుంద్రి.

బోరింగు ఆ రేత్తిరికి ఇన్నూరుదిగె.

తేమతప్ప జలరాలా!

మున్నూరు దిగె.

తెల్లంగా రాయి రాబట్టె.

"జల తప్పకుండా పడ తాదబ్బా, తెల్ల సుద్దగదా!" అంఁడ్రి జనం.

ఇంకో యాభై దిగె. శ్యాప పాలు కొచ్చె. "గ్యారంటీ. కీనీరే..." అంఁడ్రి జనం. యింకో ఇరవైదిగె. రాతి సుద్దతో బాటు పిల్లోడు ఉచ్చలు బోసినట్టు కాసిన్ని నీళ్ళు రాబట్టె.

"యింక లాభం లేదన్నా, అంతే" అనేసిరి బోరింగోళ్ళు.

"నీళ్ళు కనిపించినాయి గదా. యెట్లో వొగట్ల, నాలుగొందలు మట్టసంగాదించి ముడువు పెట్టండి." అనే మునెప్ప.

నాలుగొందలు దిగె. ఊహూ. నాభంలేకపాయ. పైగా బండొచ్చేశ.

"యింక వేస్టన్నా, దుడ్డు నష్టం ఆమింద నీ యిష్టం," అనేసి బోరింగాపేసిరి.

మునెప్ప నెమ్మలిరిగిపాయ.

"సాల్లేవయ్యా. ఆ బోరింగు కుండే మిసన్ దీసి దీనికి తగిలించు. యాడున్నే నీళ్ళు పెరుక్కొనొచ్చేస్తాయి." అంటా వొగాయప్ప ఉలపాగా ఉచిత సలహా వొగటిచ్చె.

ఇంక చేసేది లేక మునెప్ప ఆమరు దినమే మిసనూడబెరికి ఈ బోరింగుకు తగిలించి, కరెంటేయించి యిడిసె.

భారంగా వొదిలే రోగిస్టోడి ఊపిరి మాదిరి మెల్లింగ సన్నంగా నీళ్ళు దూకబట్టె. ఆ నీళ్ళతో వొగదలలో సగం పాదులు అట్ల తడిసినో లేదో దడింగిన నిల్చిపాయ మిసను. మళ్ళా మిసనొదిలి సూశ మునెప్ప. ఊహూఁ బోరింగులో నీళ్ళులే. వట్టి మిసనే పోబట్టె.

ఆ నీళ్ళతోనే యాగతా వస్తావుండె మునెప్ప. సెట్లు సస్తినో బతికితినో అన్నెట్టు యట్లనో వొగట్ల పూతనించీ పింది కొచ్చేశ. మార్కెట్లో రేటు కేజీ ఇరవై అయిదుకు సేరుకుండె.

మునెప్పకు పిచ్చి పట్టినట్లయిపాయ. ధర్ణి పైన నిలబడలాకపాయ. కందూరుకు పాయ. ఆడొగ సావుకారికి పత్రం రాసిచ్చె పదివేలు దెచ్చె. మఁరికుంట పల్లెకు పాయ. ఆడ, వడ్డీలకు దుడ్డిచ్చే సిద్దప్పకు బాండు రాసిచ్చె. ముప్పయి వేలు దెచ్చుకుండె. ఆ మాదిరిగానే మంచూరుకుపాయ. తాటి గుంట పాళెంకు పాయ. ఇట్లం పాయ. గండబోయన పల్లెకు పాయ. తెలిసినోళ్ళ దెగ్గిరంతా యింతో అంతో బీజారుకోనొచ్చె. సాలందానికి మళ్ళా సేబదుళ్ళు జేశ. ఆయప్ప పట్టుదలకు ఊర్లోవోళ్ళు యిచ్చిత్రకపాయిరి. ముక్కుమిందేలేసుకుంఁడ్రి.

"యీడి కేంరా. ఈ కరువు కాలానికి పాయ్యే కాలం. ఈడికి యెఁరియేమన్నా పట్టిండాదా యెట్లా?" అంటా అనబఁటి. అంగలార్చబఁటి.

"ఈ యిడ్డూరం యాడన్నా కద్దా?" అంటా యింకొందురు నిచ్చలకపాయిరి.

"ఈ కాటకానికి సేద్దెం అమ్మబోతే అడివిగా వుండాది. కొనబోతే కొరివిగా ఉండాది. బిడ్డా పాపావుండే వోడివి. ఈ కొంతే గాలం పసెందుకురా, నీకు ఇక్కలంపక్కలం లేనట్టుండాదే. అన్నేయంగా సెడిపోతావ్, యింతటితో యిడిసి పెట్రా ముండమోపి." అంటా యితబోధ జేసిరి నేస్తులు.

ఇంట్లోవోళ్ళు కన్నీరు మున్నీరుగా యాడ్సబట్రి. అయినా ఆయప్ప ఏమీ యినిపించుకోలా. సెవుల్లో సెట్లు మొలిసినోని మాదిరుండి పాయ పందుం సెవుదున్నోడి మాదిరి ఉలకలే, పలకలే. యాపసెట్లో దీపం పెట్టి ఊరికే యెగజూసే గుడ్లోడి మాదిరిగా వుండిపాయ. ఎవరేం సెప్పినా సెవుల్లో యేసుకోక పాయ. తాను బట్టిన దుక్కిటెద్దుకు మూడేకాళ్ళు అన్నిట్టుండె.

ఈసారి యింకో శాస్త్రిరి గారి దెగ్గిరికి పాయ. భూమిలో పాయింటు బెట్టించె. మళ్ళా బోరింగు ఆరంభించె.

భూమిలో బోరింగు దిగే గుందికీ దుడ్ల సంచీ ఖాలీ అయితా వచ్చె, బోరింగు ఆయప్ప గుండికాయ మింద యేసినట్టుండె. జలపడుతుందో పడదో అంటా పాణం ఉగ్గబట్టి సూస్తావుండె. బోరింగు లోతు దిగే గుందికి ఆయప్ప మొఖుసు యాడికో పరిగెత్తబట్టె.

"ఈ జలను నమ్ముకోని దేశమంతా అప్పుదెచ్చి పెడితి. ఆస్తమ్మినా తీరనంతా అప్పు. ఈతూరి జలపడితేనే సరిపాయనుకో. లేకుంటే సావేగతి." అనుకోబట్టె. మొఖుసు మొఖుసులో నిలబడకుండా వుండె. భూమిలో బోరింగు దడదడ అంటా దిగతావుండె. ఆయప్పగుండె దడ పెరగతానూవుండె.

నూరడుగుల కాడ మళ్ళా త్యామ కనిపించె.

"అప్పుడూ యిట్టనే మాయలేడి పిల్ల మాదిరి ఊరించి ఊదర బెట్టె అన్నేకారిజల. ఇంక ఇది గాదని ఏంపని జేసేది. అసలు చేసేదానికి ఏంపనులుండాయి." అనుకోని ఆడనే కూసోనుండిపాయ మునెప్ప.

రేత్తిరంతా వొగిటే పోరు. పాటుకు. సెవులు పగిలిపోయేంత హోరు.

నట్టనడి రేత్తిరికల్లా ఇన్నూరు దాటె. జల సన్నంగ రాబట్టె. మునెప్పకు ధైర్ణం నెమ్మొల్లోనించీ యెలబారి గుండికాయల్లోకి రాబట్టె. తెల్లారేగుందికి మున్నూరు దాటి, ఆమింద యాభై దాటె.

ఉన్నిట్టుండి దడక్కన పైపుతో కొట్టినట్టుగా నీళ్ళు 'ఓ' అంటా పెరుక్కోని రాబట్టె. బోరింగేపట్టనంతగా, రెట్లావులో పెరుక్కుండె. బురదతో బాటుగా అదే పనిగా నీళ్ళను బయటికి కుమ్మరిస్తా వుండె బోరింగు. బోరింగేసే దానిక్కూడా సాద్దెపడనంత జల వొగిటే జల, గంగమ్మ తల్లికి పిచ్చి బట్టి ఉరికినట్లు ఉప్పళంగా దూంకతావుండె. మునెప్ప నెత్తిన పాలు బోసినట్టాయ. అందరికీ సంతోసమైపాయ.

"ఇంకేం పరవాలేదు లేన్నా, నీ కరువు కడతేరి పోయినట్టేపో" అంటా బోరింగోళ్ళు ఆపేసిరి.

"ఈ కరువు కాలంలోను ఇంత జలపడిందే. అదురుష్టమంటే మునెప్పదేపో" అంటా అనబట్రి.

ఆ మాట వింటా వుంటే మునెప్ప సెవుల్లో తేనెపోసినట్టుండె. అమృర్తం చిలకరించినట్టుండె. సంతోసం పట్టగుల్లా.

బోరింగు తీసేసినా గూడా నీళ్ళు తన్నకొచ్చి కాలవ గట్టి పోతావుండె. ఆ నీళ్ళను సూసే గుందికి మునెప్పకు కడుపు సల్లంగయితావుండె.

"ఈ గంగమ్మ తల్లికి యిన్ని దినాలకు నా పైన కనికారం కలిగిందే" అనుకుంటా వుండె.

"యిన్ని దినాలు నన్ను యాపకతిని యిప్పుడేడినించీ వచ్చిపడితివే గబ్బుదానా." అంటా ముదిగారంగా తిట్టపోస్తా కూడా వుండె, ఆ వార్త యిని సుట్టు పక్కాల రైతులంతా వొగరొగరే వచ్చి నీళ్ళు సూసిపోతా వుండ్రి. దాన్ని చూసి కొందరు తామూ బోరింగేయించాలనుకుండ్రి. దుడ్డు వొదిగినోళ్ళు కొందురు వోళ్ళ భూముల్లో బోరింగులేయ బట్రి.

మునెప్ప పాత బోరింగుకుండే మిసన్ దీసకొచ్చి కొత్త బోరింగుకు బిగించె మిసన్ రేయింబగుళ్ళు పోతానే వుండె.

"యిదే మాదిరుంటే, యింక ఈ పదెకరాల్లోను బంగారం పండదా ఏందీ?" అంటా బోఆనందపడిపాయ మునెప్ప.

కానీ ఆ ఆనందం ఎన్నో దినాలు నిలవలే.

పట్టు మంటా పది దినాలు తిరక్కనే బోరింగులో నీళ్ళు తగ్గిపోబట్టె. దాంతో సచ్చీ బతికి పదిదినాల కొగతడి లెక్కన సరిపోబట్టె. అల్లికి అల్లి సున్నకు సున్నగా అందీ అందకుండా వుండె.

"సుట్టు పక్కాల, యాడ జూసినా బోరింగులేసేస్తావుంటే అట్లగాక యింకెట్లొస్తాయి నీళ్ళు."

"పోనీ యింకెవురి కన్నా పుంజిగా నీళ్ళు పడినాయా అంటే అదీ లేదే."

"అందుకే గదా ఈ గడ్డన మడిసేద్దేలే కరువైపాయ."

"అందరి పరిస్తితి అట్లేవుందిలేబ్బా."

వొగరి బాధలొగరు సెప్పుకో బట్రి రైతులు.

మునెప్ప సెట్లకు పురుగాడకుండా, రోగం తగలకుండా ఏవేవో మందులు తెచ్చి కొట్టె, సెట్లు పక్కానికొస్తావుండె. ఎట్టయితేనేం? టమాటా సెట్లు మళ్ళా తేరుకుండె. పిందెలు కాయలాయ.

ధర ఎట్టుండాదో తెలుసుకుందామని వొగ దినం మార్కెట్లో అడుగు పెట్టి యిచ్చిత్రకపాయ. మార్కెట్లో యాడ జూసినా టమాటాలే. రంగు రంగుల టమాటాలే. సూసేదానికి రెండు కండ్లు సాలకుండా వుండె.

కాయలు బండ్లుదించే వోళ్ళు, సరుకు మారు బేరాలు జేసేవోళ్ళు, బండ్లకెత్తించే వోళ్ళు వొగిటే యేడిగ్గావుండె. ఆడ వొగతిరణాల సాగినట్టుండె.

కలికిరి టమాటో మార్కెట్టు జిల్లాలోనే పెద్ద మార్కెట్టు గదా, దేశంలోనే మ్యాంగో నగర్‌గా పేరెల్లిండే దామల్ సెరువులో మావిడి కాయలేపారం యెట్ల జరగతాదో, సిత్తూర్లో అరగొండ బెల్లం యాపారం ఎట్ల జరగతాదో, అట్ల కలికిరిలో టమాటాలేపారం జరగతా వుంటాది. ఈన్నించీ దేశంలో యాడికేడికో లారీలకు లారీలు పండ్లు పోతావుంటాయి గదా అనుకుండె.

అంత టమాటాల మార్కెట్టును మునెప్ప ఆడ తప్పాయింకేడా సూడలా. అట్లే నిచ్చలకపోయి వొగ్గెడివుసేపు మార్కెట్టును సూసినాంకా, యింకొంచెం ముందుకు పాయ వొగ్గైతును రేటడిగి కనుక్కుండె.

ఆ రేటినే గుందికి మునెప్ప మొణుసు సివుక్కుమనె.

ఆ ముందు దినందాంకా కేజీ ఇరవై అయిదున్న రేటు ఇరవై కొచ్చిండె. మున్నూరున్న మేలు టమాటాతట్ట ఇన్నూటేభైకొచ్చిండె.

"యిట్లే వుంటుందా! యింక యెగబడదా ఏమీ?" అనుకుంటా యింటి ముఖం బట్టె మునెప్ప.

తోటలో టమాటా కాయలు ముదిరి దోరకొచ్చె. అదే సమీంలో కలికిరి మార్కెట్లో రేటు క్రమేణా పడిపోబట్టె.

కూలోళ్ళను పిలిపిచ్చి దోరకాయల్తో బాటుగా పండిన కాయలన్నిట్నీ కోయించి బండ్ల కెక్కించి మార్కెట్టుకేసకపాయ.

ఆ దినం దేశంలో యాడున్నె టమాటాలు మార్కెట్లో దిగిపోయిండె అది సూసేగుందికి మునెప్ప మునాస మోకాళ్ళ కిందికి దిగిపాయ.

ఎంత ప్రయాసపడినా కేజీ అయిదుకు మించలా. రైతులు అయినకాడికి మద్దేనంగా కాయలమ్ముకోని పోబట్రి.

మునెప్ప కూడా అంతకు మించి ఏమీ చేయలేకపాయ. సరుకును సరసంగానే ధారపోసేశ వచ్చిన దుడ్లు సూసుకునే గుందికి ఆయప్ప మొణుసు, కుతుకుతా ఉడికి పాయ.

"ఇన్ని పడుబాట్లుబడి పండిస్తే, కూలిపాటుకు సరిపోయేట్టుగా వుండాదంతేనే. సేసుండే అప్పులకు ఈ కాసులుదీసుకోనిబొయ్యి ఏ బొక్కలో పెట్టేది. అన్నీ బొక్కలే. ఏ బొక్క పూడతాది. యాడని మాసికేసేది? ఉస్సబ్బా" అనుకుంటూ ఉసుకొడతా యింటి కొచ్చి దిగులుగా కూసుండె.

"ఈ తూరి కాకపోతే యింకొగతూరన్నా రేటు రాకుండా పోతుందా?"

అంటా ఈళ్ళూ వాళ్ళూ, ఇంట్లో వాళ్ళూ ధైర్నం సెప్పిరి.

పది రోజులు గడిసె. బోరింగులో నీళ్ళు యింకా తగ్గబట్టె.

మలి కోతలో టమాటాలన్నీ ముక్కాలు భాగం పైగానే, వొగేతూరి కోతకు రాబట్టె. మళ్ళా అప్పుదెచ్చి కూలీలను పిలిపిచ్చి కాయలన్నీ కోయించె. పండ్లన్నీ అయిదు బండ్లకాయ. పెద్ద పెద్ద దొల్లలు బండ్లల్లో యేసి, నిండా కూరికూరి పోయించె. ఇంక దినాముమ్మ పండ్లు కోతకు వస్తానే

వుంటాయి. ఆ వారం పొడుగునా కూలీలు రావాల్సిందే. సెట్లల్లో మాగతావుండె కాయల్ని పెరికి పెరికి తట్లకేసుకోని బండ్లకెత్తించాల్సిందే. ఆ బండ్లను మార్కెట్టుకు తోలకపోవాల్సిందే.

పంట వడుపుకునే దాకా కూలీలను ఎగేసుకోని, పండ్లు కోయించి, యాదినానివి ఆ దినానికి మార్కెట్టుకు చేర్పించే బాద్దెత పెండ్లాంబిడ్డెలకు అప్పజెప్పి, బండ్లను తోలించుకోని మార్కెట్టుకుపాయ మునెప్ప.

అక్కడ పరిస్తి సూసేగుందికి ఆయప్ప గుండికాయ నీళ్ళయిపాయ. యాడ జూసినా, టమాటాలే. కుప్పలు కుప్పలుగా టమాటాలే, పసుపు కొండలు మొలిచినట్టు దోరలు, కుంకం రాసులుపోసినట్టు మాగినపండ్లు. మార్కెట్టునిండా యాడగానీ సందు లేకుండా గుట్టలు గుట్టలుగా టమాటాలే. ఆ తావన టమాటాలు పుల్సిన వాసన.

గేటు కాసులు గట్టి మార్కెట్లో యెట్లనో, కడాన కాసింత తావు జూసుకోని తమాటాలు కుప్ప పోయించుకుండె.

అట్ల ఆయప్ప తెల్లారి ఎనిమిదికంతా మార్కెట్లో అడుగు పెట్టినప్పటినించీ సందేళ దాంకా టమాటాలు అడిగిన నాధుడేలే, వొగరిద్దురు అడిగినా గిట్టుబాటు కనిపించలా. కేజీ రూపాయకు మించి అడగలా. అన్ని టమాటాలు సూస్తా సూస్తా అంత అగ్గవగా అమ్మేదానికి మొఖుసొప్పలా. గుండె పిండేసినట్టయితావుండె. అన్నం తినబుద్ధి కాలా. నీళ్ళు తాగను ఇచ్చగించలా, వొగిటే యాది, మనోయాది. కడుపులో ఎవురో సెయ్యి బెట్టి కలబెట్టినట్టు వొగిటే యాతన. మాటి మాటికీ బుర్ర గిర్రన తిరగబట్టె.

తను పడిన కష్టం తనకుండే బాదర బందీలు కూచ్చోనీలా, నిలబడ నీలా, మొఖుసుకు నిలకడలేకపాయ, కాలుగాలినపిల్లమాదిరి ఆకుప్ప సుట్టకారం తిరగబట్టె.

తల్చుకునే గుందికీ మునెప్పకు తిక్కరేగబట్టె. ఆ తిక్కే తీరని యాతనగా మారిపోబట్టె. ఆ యాతన తోనే రొండుదినాలు గడిసిపాయ. అయినా టమాటాలడిగినోడేలేకపాయ. తోటనుంచీ బండ్లు బండ్లుగా కాయలు దిగతానే వుండె. కుప్ప పెరగతానే వుండె.

రాను రాను యాడ టమాటాలాడనే కుళ్ళి పోబట్టె, పులిమింద పుట్ర పడినట్టు, దానికి తోడు వున్నిట్టుండి ఆకాశిం కావురేగి మబ్బులేసి, సన్నంగా జల్లులు రాలబట్టె. వానకు తడిస్తే, ఆమింద టమాటాలు ఎద్దులు కూడా తినవుగదా.

రైతులొగ రొగరే వానను తిట్టుకుంటా యాడ టమాటాలు ఆడనే యిడిసి పెట్టేసి పోబట్రి. మునెప్పకు దుఃఖం ముంచకొచ్చేస్తా వుండె. రేటులేని కారణంగా మార్కెట్టులో టమాటాలు కూడ దిగలే. సుట్టు పక్కల భూముల్లోవుండె సెట్లల్లోటమాటాలు సెట్లల్లోనే మగ్గిపోతావుండె. టమాటా తోటలన్నీ పరిగిలి వదిలేసిండ్రి.

మునెప్పకు తన కష్ట ఫలం వదిలి పెట్టి పోను బుద్ధిగాలె, అట్టనే ఆ మరు దినమూ వుండిపాయ. ఆ మూడు దినాలూ ఆయప్ప కంటికి నిద్దర్లా, కడుపు కింత తిండిలా. కండ్లు

తిరగబట్టె.

"ఈ పూట ఎంతకో వొగంతకు దారపోసి పోవాల్సిందే. లేకంటే సందేళకు ఈ దరిద్రాన్ని ఈన్నే వదిలేశన్నా పోవాల్సిందే. దీన్ని యింకా నమ్ముకోని ఏం ప్రయోజనం." అనుకుండె.

ఆదినం మాఁవిటేళ కాడ ఎవురో వొగ అసామి వచ్చె. ఆఅయిదు బండ్ల టమాటాలు కలిపి ఇన్నూరుకడిగె. ఆ రేటినే గుందికి మునెప్ప గుండె గెభీమనె.

"సచ్చినోడి పెండ్లికి వచ్చిందే లాభం" అనుకుంటా 'సరే'నని. ఆ ఆసామీ సెంచికారంగా నూటయాభయ్యిచ్చె. మిగిలిన యాభయ్యా మళ్ళీస్తాన్లేవయ్యా అనె. మునెప్ప ఆ నూట యాభయ్యా తీసుకోని నేరుగా, ఆడికి రోంతదూరంలో వుండే హోటలుకు పాయ. అన్ని దినాల ఆకిలి తీరేట్టుగా కడుపునిండా తినె. అన్నించీ నేరుగా ఎరువులంగిడికాడికి బొయ్యి మిగిలిన దుడ్డంతా యిచ్చి నోవాక్రాన్ పురుగుల మందు వొగ డబ్బా తీసుకుండె. మళ్ళా మార్కెట్టుకాడికొచ్చె అప్పటికి బాగా పొద్దుపోయ.

కాయలు కొనుక్కున్న ఆసామీ టమాటాలెత్తించి లారీకి పోయిస్తా వుండె. అట్ల ఆ టమాటాలన్నీ అయిపోయిందాకా ఆ ఆసామీ మిగిలిన యాభయ్యా ఇయ్యలా. ఆయప్ప దుడ్డిచ్చే గుందికి సగం రేత్తిరి ఎప్పుడో దాటిపాయ.

ఆ యాభయ్యా, ఆడబ్బా తీసుకోని ఆసీకట్లోనే ఊరుదారిబట్టె మునెప్ప. ఊరి గెవిన్లోకి జేరేటప్పటికి తెల్లారిపోబట్టె...

వొగిటే యోచ్చన్లు ... జరిగిపోయిందేదంతా మల్లామల్లా గుర్తుకొస్తావుండె. "ఎదవ బతుకు ఎదవ బతుకు" అనుకుంటా పీకి పీకి పారేస్తా వుండె.

◆ ◆ ◆ ◆

అట్ల ఎంత సేపు పీకినాడో ఏమోగానీ ఆయాస మొచ్చి కండ్లు బైర్లుకమ్మె. భూమి గుండ్రంగా బొంగరం మాదిరి గిరగిరా తిరిగినట్లనిపించె. లేపిన గొడుగు సుట్రగాలికి ఊగిపోయినట్టు ఆకాశం ఊగినట్లనిపించె.

మెల్లిగా వచ్చి వొగ్గెడివుసేపు గెనింమింద కూసోని తెపరాయించుకుండె. మళ్ళా సెట్లకల్లా వొగ తూరి సూసి 'తు' అంటా తుపుక్కున ఎంగిలి ఊంచి, పక్కనే వుండే డబ్బా తీసుకుండె.

దాని పక్కనే పడిందే సెట్టు "య్యోవ్ మా రాజా! వద్దయ్యా వద్దు నా మాటిను." అంటా వుండె.

"నేనెవురి మాటా యిననే" అంటా పైకిలేశ.

"వద్దు నా మాటిను. నువ్వే మాకు ప్రాణం. దేశానికి ఎన్నెముకవి. అన్న దాతవి. నామాటిను" ఆ సెట్టు అరస్తానే వుండె.

"నీకూ నాయకలచ్చణాలొచ్చిండాయి. కతలు కట్టిపెట్టు. అయినా నువ్వేంది నాకు

సెప్పేది. పో...నీబగిసిమార! పో....పో...' అంటా ఆయప్ప వొగ పరుగున సెట్లల్లోకి దూంకె. పీకేసిండే తమాటాసెట్ల కుప్పమిందకురికె. ఆమింద వాటి నెత్తిన తసిక్కిన కూలబడె. ఆ దెబ్బకు ఆ సెట్లు, సెట్లల్లో వుండే కాయలు అన్యాయంగా అప్పచ్చి మాదిరిగా నలిగినలిగి నాసినమై పోతావుండె.

గడ్డ నుండే సెట్లు లబలబ మంటా నోరు కొట్టుకున్నట్టు అరస్తానేవుండె, ఆయప్ప సేతిలో వున్న డబ్బామందు కడుపులోకి పాయ.

"అయిపాయ. అంతా అయిపాయ. అయిన కాడికి మద్దేనమైపాయ. పర్లాకిలి బట్టిపాయ. నాసినమైపాయ. సర్వనాసినమైపాయ, పైకి లెయ్యకుండా అయిపాయ. బతికేది బాలేది యింకేడ? వట్టి బెమత. అంతే"

అంటా మునెప్ప గెట్టిగా యాడ్సుబట్టె ఆ సుట్టుకైవారం వుండే ఎండిపోయిన సెరువులు, బావులు ఆయప్ప యేడుపుతో ధ్వనిపలకతావుండె.

ఆయప్ప గుక్క తిరుక్కోకుండా యాడస్తావుండె. ఎక్కెక్కి యేడస్తావుండె. కడుపు సెరువయ్యేట్టుగా యేడ స్తావుండె.

అది జూసి గడ్డనుండే సెట్టూ వలవలాయాడ్సుబట్టె.

దాని యేడుపు జూసి తోటంతా యాడ్సుబట్టె, సెట్టుసెట్టు యాడ్సుబట్టె, పండుపండూ యేడ్సి, కాయ కాయ యాడ్సుబట్టె, ఆడుండే రాయీ రప్పా సకలమూ అంగలార్చబట్టె.

సూరీడు మాత్రం, కుండల్తో నిప్పులు కుమ్మరించినట్టు ఎండ కాసింది కాసిందిగానే వుండె. మలమలామాడ్చే దానికి మల్లుకుండె.

ఎంత ఎండయినా, వానయినా. ఎంత దుఃఖమైనా, సంతోసమైనా

ఇంక ఆయప్పకు తెలుసునా ఏందీ? వళ్ళు సొరకం తప్పి పడిపోయిండె గదా!

❖ ❖ ❖ ❖

ఆ దినం ఆదివారం సంత ...

సంతకు సరుకులు, కూరగాయలు యేసకపోతా వున్నె రైతులు, పొద్దన్నె టమాటా తోటలో మనిషి పడిండేది జూసి పరిగెత్తుకుంటా వచ్చిరి. గబగబ ఎద్దల బండ్లో యేసుకోని ఆసుపత్రికి దోల్రి. ఎంటిక వాసిలో ఆపితి తప్పిపాయ. ఎట్లనో వొగట్ల మునెప్పను బతికిచ్చి గడ్డ నేసె డాక్రటు.

సచ్చి బతికిన మునెప్ప ఆ దినంనుంచే దేనికీ భయపడేదేలే, ఆయప్పకు ఎవురన్నా లెక్కాజం వా లేకండానే అయిపాయ. మడిసి మొండోడైపాయ. ఆయప్ప గుండె బండమాదిరైపాయ. కష్టమొచ్చినా సుఖమొచ్చినా ఆయప్పకు వొగిటిగానే అయిపాయ.

సేసేదానికా సేద్దేలేకపాయ. పనులూ కరువైపాయ. ఆయప్ప ఎప్పుడూ ఈదిలో

కూర్చుండేది. బీడీలు తాగతావుండేది. వచ్చినోళ్ళతో అరువులు జేస్తా వుండేది. ఎవ్వరైనాసరే ... లెక్క జేసేదే లేదు

కాళ్ళు సాంచి సాంచి నడస్తా వున్నిట్టు కాలం గబ గబా గడిసి పోతావుండె. అట్ల నిరంతరమానంగా పరిగెత్తే కాలమన్నా వొగఛణం నిలబడి పోతుందేమొగానీ అప్పులోళ్ళు మాత్రం అనుకున్నకాడికి అరఛణం గూడ ఆగరు గదా. వొగరొగరే మునెప్ప యింటికి రాబట్రి.

ముందుగా ఎరువులంగడాయనొచ్చి, అప్పు గట్టమని అడిగె. లేకంటే కోర్టుకేస్తాననె

'యేసుకోపో' ధైర్నంగా అనె మునెప్ప.

యింగొగ దినం లోనిచ్చిన బ్యాంకీవోళ్ళొచ్చిరి, దుడ్డు తిరిగి కట్టమంట్రి.

"నేను కట్టను పోండి" అనె మునెప్ప.

"కోర్టుకేస్తా" మంట్రి వోళ్ళు.

"యేసుకోపోండి" తలెగరేసి మాట్లాడె ఈయప్ప.

బ్యాంకీవోళ్ళు సరేనంటా యెల్లి పొయిరి.

వొగ వారం గడిసె, అనాక సొసైటీ వోళ్ళొచ్చిరి. బాకీ కట్టకపోతే ఇల్లు జప్తు చేస్తామంట్రి. అయినా ఆయప్ప భయపడలా.

"చేసుకోపోండి" అంటా నిబ్బరంగా జెప్పె.

"జప్తు చేయడమంటే ... యింట్లోవుండే బిందెలు గిందెలు అన్నీ యాసకపోవడమే" అంటా అంట్రివోళ్ళు

"ఇంట్లో వుండేవన్నీ సత్తు గిన్నెలు, మట్టి కడవలే, యాసకపోండి" అనె మునెప్ప.

"అవి లేకపోతే ఏం? గొడ్డూగోదాలేవా? అవి పట్టకపోతాం" అంట్రి.

"అవి ఎప్పుడో కబేళాకు పోయిండ్లా, యింక మిగిలిండేదిమేమూమా బిడ్డెలు మమ్మల తోలకపోండి." వెటకారంగా అనె మునెప్ప. యింకేం జేసేదిరా భగమంతుడా అంటావోళ్ళు యెల్లి పొయిరి

వోళ్ళు బొయిన కొన్ని దినాలకు, అయిదు రూపాయ లొడ్డీకి దుడ్డిచ్చిండే మర్రికుంటపల్లె సిద్దప్పొచ్చె. నా దుడ్డు కక్కు అనె "నువ్విచ్చిండే దుడ్డు భూంపైన పెడితిగానీ కడుపుకు తినలే. తినందే యెట్ల గక్కేది?" పొడిసినట్టనె మునెప్ప.

"అయితే ఏం జెయ్యి మంటావ్?" అడిగె సిద్దప్ప.

"జరిగినప్పుడు అసలిస్తా పో..." అనె మునెప్ప.

"అది కుదరదు. యిప్పుడే కక్కు" అనె సిద్దప్ప.

"నా వల్లా గాదు." అనె ఈయప్ప.

అయితే నీ అంతు జూస్తా" అనె ఆయప్ప.

"వొగతూరి సచ్చిబతికినోన్ని, నా అంతు ఏం జూస్తావ్?" నిమ్మళంగా అనే.

"కోర్టుకేసి నిన్ను నడి రోడ్లో నిలబెడతా" ఆయప్ప బెదిరించె.

"కోర్టుకు పోకనే కొల్లబోయి నడి రోడ్లో నిలబడినోన్ని, ప్రతేక్యంగా యింక నువ్వేంది నిలబెట్టేది?" ఈయప్ప సివంగిమాదిరి పైకిలేసె. ఆమింద నోటి మాట రాక నోరు మూసుకోని సక్కంగా పాయ సిద్దప్ప. అదే మాదిరి కందూరు సావుకారొచ్చి బాకీ అడిగి, భంగపడి యెల బారిపాయ. యింకా మంచూరు, తాటి గుంట పాళెం, ఇట్లం, గండ బోయన పల్లె నుంచీ అప్పులోళ్ళొచ్చి, ఇచ్చిందడిగి, వట్టి సేతుల్తో సక్కంగ పాయిరి.

అట్లనే సేబదుల్లిచ్చినోళ్ళంతా వచ్చిరి. మాది మాకిచ్చెయ్ అంద్రి.

"నాకిప్పుడు జరగలా, యివ్వలేను" అనె.

"అయితే యింకెప్పుడిస్తావ్?" అంద్రి.

"నా బతుకు బాగుపడినప్పుడిస్తా."

"నీ బతుకు ఎప్పుడు బాగుపడేది?"

"ఆ భగవంతుడికేయెరికె."

"ఆ భగవంతుడికి యెరికయ్యేదెప్పుడు?"

"నాలాంటి రైతులంతా సచ్చి, ఈ ప్రెపంచికానికి తిండి కరువైనప్పుడు!" కసిగా అనె మునెప్ప.

"మొండోడు ... మొండోడు బండకంటె బలవంతుడని ఊరికే అనలా. అట్టాంటోన్ని యెవురు మాత్రం ఏమి సాధిస్తారు, వోడిచ్చినప్పుడే తీసుకుందారి." అంటావొచ్చినోళ్ళు వచ్చినట్లే ఎనిక్కిపాయిరి.

"తు ... యెదవబతుకు. యింటి కాడున్నే, బయటికొచ్చినా ఈ అప్పులోళ్ళ బాధ తట్టుకోగుల్లా, బతుకేవొగ జలజూదంగా మారిపోయిండే ఈ గడ్డన సొసంత్రంగా సచ్చిపోయే అదురష్టం గూడా లేక పాయ." అనుకుంటా సగం తాగిసెవులో పెట్టుకోనున్నె బీడీ ముక్క తీసి నోట్లో పెట్టుకోని, ముట్టిచ్చె,బీడీ తాక్కుంటా బాయికాడికి యెలబారె మునెప్ప.

అప్పటికి గొడ్లుమేసేసి, తొక్కేసి పరిగిలిబట్టి పోయి పిచ్చిదాని తల మాదిరుండె టమాటా తోటలో సెట్లన్నీ సగం పాణంతో, ఎండీ ఎండకుండా కోలెలు మాత్రమే కనిపిస్తావుండె. 'ఏమి సేద్దైమో, ఏమి పంటలో' అనుకుంటా గెనింమింద నడస్తామంటే ఎవురో పిలిసినట్టాయ. తిరిగిజూశ.

ఎక్కడా ఎవురూ కనిపించలా. .గానీ ఎదురుగా ... వొగబ్బుడు తాను పీకేసి కుప్పేసిండే తమాటా సెట్లు నేలకు అనక్కపోయిదంట్లు దంట్లుగా కనిపించె. అయినా ఎవురో పిలస్తానే వుంద్రి ఆ పిలుపు యాడనో కింద సన్నటిచ్చ్యాంద బాయిలో నుంచీ యినిపిస్తా వున్నిట్టుండె.

"ఎందుకట్లా సూస్తావయ్యా సామీ. యింకా గుర్తుకు రాలా, నేనయ్యా మా రాజా! నువ్వు పురుగుల మందు తాగేముందు, నన్ను పెరికి ఈ గడ్డ నేస్తివే .... ఆ సెట్టును టమాటా సెట్టును."

"ఓ .. నువ్వా! యింకా యెట్ల బతికుండాలే నీ పాసుల గోలా?"

"అమద్దెన సుమారిపాటి వాన బడెగదా! పోయే పేణం మళ్ళా వచ్చె"

"నీది మొండి బతుకే. వొగపట్టాన సావవుగదా"

"నీ కంటేనా?"

"నన్ను మొండిగా మార్చింది నువ్వూ నీ జాతి."

"నింద మా పైనేస్తే పురుగులుబడి సస్తావ్!"

"నోర్మూయ్!"

"ఎందుకట్లా అరస్తావ్ గానీ ... నీ మొండి తనమే మిగిలిన రైతులకు ఆదర్శమైపాయ. వోళ్ళకూ ఎక్కడ లేని ధైర్యం వచ్చేసిండాది వొగొగనికీ యెయ్యేనుగుల బలమొచ్చేసిండాది."

"సాలించు నీ రామాయణం!"

కోపంగా దాన్నెత్తిన వొగడుగేసి తిరిగి సూడకండా పోబట్టె మునెప్ప.

"అయ్యాయ్యో! యిప్పుడు సంపితివి గదయ్యా నన్ను."

ఆ సెట్టు పాణం పొయ్యే మాదిరి కీసుగొంతుతో అరసబట్టె.

ఆయప్ప అదేమీ యినిపించుకోలా. పోతానేవుండె.

నిజమే మునెప్పను జూసి మిగిలిన రైతులూ ఆయప్ప మాదిరే సమాధానం సెప్పబట్రి. లోన్లు, సేబదుళ్ళు తిరిగిచ్చేది లేదంటా తిరగబడ బట్రి.

బతుకులు మండి జగమొండోళ్ళుగా మారినోళ్ళను సాధించే దాని కెవురి తరమైతాదిమరి

*● 22-12-2002 ఆంధ్రజ్యోతి - వార పత్రిక ●*